క్లుప్తంగా

ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలి


డీఎంహెచ్‌ఓ వై.ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని ప్రయివేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్నూలులో డీఎంహెచ్‌ఓ వై.ప్రవీణ్‌కుమార్‌కు డీవైఎఫ్‌ఐ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ మాట్లాడుతూ.. పట్టణంలోని కొన్ని ప్రయివేట్ ఆస్పత్రులు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డీఎంహెచ్‌ఓ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, హుసేన్‌బాషా తదితరులు ఉన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి


ఎంఈఓ ఆంజనేయులుకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని స్థానిక విద్యార్థి సంఘాల నాయకులు లింగన్న, పవన్, రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంఈఓ ఆంజనేయులుకు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను విద్యార్థులకు అధిక ధరకు విక్రయిస్తూ ఆయా పాఠశాలల యాజమాన్యాలు వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. వీటిని అరికట్టాలని, అలాగే జీఓ నంబర్ 77, 117ను రద్దు చేయాలని కోరారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి


తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలోని వెల్దుర్తి మండలం రత్నపల్లెలో దళిత మహిళ హనుమక్కపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తాయప్ప, మారయ్య మాట్లాడుతూ దళిత మహిళ హనుమక్క గత 30 సంవత్సరాల నుంచి సాగుచేసుకుంటున్న భూమిపై ఆధిపత్య వర్గాల కన్నుపడిందన్నారు. ఆమె సాగుచేసిన పంటను ధ్వంసం చేసేందుకు పూనుకున్నారని అడ్డుకోబోయిన హనుమక్కను కొట్టి గాయపరిచారని తెలిపారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదుచేయకుండా హనుమక్కను భయభ్రాంతులకు గురిచేయడం పోలీసులకు సరికాదన్నారు. నిందితులను అరెస్టు చేయకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో దావిద్, వీరప్ప, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు నుంచి పడి వృద్ధుడికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇబ్రహీం

ఆదోని అర్బన్: పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఇబ్రహీం (60) బస్సు ఫుట్‌బోర్డు నుంచి కింద పడి గాయాలపాలయ్యాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఇబ్రహీం పని నిమిత్తం ఆదోనికి బయలుదేరాడు. గ్రామంలో బస్సు ఎక్కి సీట్లు ఖాళీ లేకపోవడంతో మెట్లపై కూర్చున్నాడు. బస్సు వెళ్తుండగా అలసటతో కునుకు తీశాడు. కుప్పగల్ గ్రామ సమీపాన రోడ్డుపై పశువులు అడ్డు రావడంతో బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ఫుట్‌బోర్డుపై నిద్రమత్తులో ఉన్న ఇబ్రహీం పట్టుజారి బస్సు నుంచి కింద పడ్డాడు. గాయాలపాలైన ఇబ్రహీంను బస్సు డ్రైవర్ మహమ్మద్‌ఖాన్, కండక్టర్ గణపతి చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆప్కాస్‌లో చేర్చాలని వినతి

ఆదోని అర్బన్: 104లో పనిచేస్తున్న వారిని ఆప్కాస్‌లో చేర్చాలని కోరుతూ ఆ ఉద్యోగులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా 104 ఉద్యోగ సంఘం సభ్యులు నగేష్, మోహన్‌రాజు, అబ్దుల్‌నబీ, రాజు, వెంకటేష్, మధు, జీవన్, విజయ్ పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. ఆరోగ్యం భద్రం

- వాతావరణ మార్పులతో విషజ్వరాల వ్యాప్తికి ఆస్కారం
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం
- వ్యాధుల నియంత్రణకు వైద్య, శానిటేషన్ విభాగం చర్యలు


గోనెగండ్లలో ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

గోనెగండ్ల: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాలకు వీధులు, కాలువల్లో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కాలంలోనే డెంగీ, మలేరియా ఉధృతి పెరిగే ప్రమాదం ఉంది. జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చని చెబుతున్నారు.

ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల తాగునీరు కలుషితం అవుతున్నాయి. మరికొన్ని చోట్ల వర్షపు నీరు నిలిచి దోమలు పెరిగి పలురకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. వ్యాధుల కట్టడికి వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రజలు ఇళ్లల్లో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. టైఫాయిడ్, డెంగీ, మలేరియా, కామెర్లు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చు. ఇప్పటికే పంచాయతీ శానిటరీ విభాగం వారు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మురుగు ప్రాంతాల్లో హైపో పిచికారీ చేసే ప్రక్రియను ప్రారంభించారు.

నివారణ చర్యలు

విషజ్వరాల కట్టడికి పంచాయతీ అధికారులు, శానిటరీ సిబ్బంది, వైద్య సిబ్బంది కృషి చేయాల్సి ఉంది. వారానికి ఒకరోజు డ్రైడే పాటించేలా వార్డుల్లో, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలి. సమస్యలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోవాలి. జ్వరం వచ్చిన వారితో పాటు అనుమానితుల వద్ద కూడా రక్త సమూనాలు సేకరించాలి. అవసరమైతే ఉచితంగా మందులు పంపిణీ చేయాలి. కాలువల్లో మురుగు నిల్వకుండా చూడడంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకపోతే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలి. అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, యాంటీబయాటిక్స్, సెలైన్ బాటిళ్లు, రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. సాధ్యమైనంత వరకు నీటిని కాచి చల్లార్చుకుని తాగాలి. ఏఎస్‌ఎంలు, ఆశా వర్కర్లు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– డాక్టర్ రవళి, పీహెచ్‌సీ, గోనెగండ్ల

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించాలి. నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయకూడదు. మల, మూత్ర విసర్జన అనంతరం సబ్బుతో చేతులను శుభ్రపరుచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. పనికిరాని సీసాలు, డబ్బాలు, కొబ్బరిచిప్పలు, టైర్లు, వాటర్ బాటిళ్లు, కూలర్లలో నీరు నిల్వ ఉంచరాదు. పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి. చిన్నపిల్లలకు ఒంటిని పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు వేయాలి. ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

మండలాభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

నందవరం: మండల అభివృద్ధి కోసం ప్రతి అధికారి సహకరించాలని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజా సేవలో నిర్లక్ష్యం వీడి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రైతుల భూవివాదాలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఈఓపీఆర్‌డీ ఈశ్వరయ్య, మండల విద్యాధికారి రఘునాథ్, పీఆర్ ఏఈ జయన్న, వ్యవసాయాధికారి స్రవంతి, ఏపీఎం చిన్న వీరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలుచేయాలి


మాట్లాడుతున్న ఎంఈఓ-2 మధుసూదన్‌రాజు

ఎమ్మిగనూరురూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని తహసీల్దార్ శేషారెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో తహసీల్దార్ శేషారెడ్డి, మండల విద్యాధికారులు మధుసూదన్‌రాజు, ఆంజనేయులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఆర్‌టీఈ కింద సీటు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ద్వారా ఎంపికైన విద్యార్థుల పట్ల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే సహించేంది లేదన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పుస్తకాలతోనే బోధన చేయాలని ప్రైవేటు పాఠశాలల సిబ్బందికి సూచించారు. విద్యాహక్కు చట్టం నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తే తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారి అనిల్‌సాగర్

ఆదోని టౌన్: టీబీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అనిల్‌సాగర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని హనుమాన్ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన టీబీ, అతిసారా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ యూనిట్‌లో గళ్ల పరీక్ష, రక్త పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలను ఉచితంగా చేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా ఆరు నెలలకు సరిపడే మందులు, ప్రతినెలా రూ.500 చొప్పున ఆరు నెలలపాటు అందిస్తారన్నారు. వారికి కావాల్సిన పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. దగ్గు వచ్చినప్పుడు చేతిని అడ్డుపెట్టుకోవాలన్నారు. కుటుంబ సభ్యులకు ఈ వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అతిసారా వ్యాధి ప్రబలకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. సూపర్‌వైజర్ బాబురాజు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలి


డీసీహెచ్‌ఎస్ ఆర్.మాధవికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరురూరల్: గర్భిణి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి శిశువు మరణానికి కారణమైన సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ప్రభుత్వాసుపత్రికి విచారణకు వచ్చిన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆర్.మాధవికి విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేంద్ర, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వీరేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే వైద్యులు మాత్రం ప్రైవేటుగా క్లినిక్‌లు నిర్వహిస్తూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అక్తర్‌బాను అనే మహిళకు సిజేరియన్ చేయగా మగ శిశువుకు జన్మనిచ్చిందని, రోజుల వ్యవధిలోనే శిశువు మరణించాడని, దీనికి కారణం సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి నిర్లక్ష్యమేనని ఆరోపించారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు రామకృష్ణ, సురేంద్రబాబు, కృష్ణ, సురేష్, ఖాజ తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో వివాదం

- రెండు వర్గాలపై కేసు నమోదు

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో పింఛన్ల పంపిణీలో వివాదానికి దిగిన రెండు వర్గాలపై మంగళవారం కేసు నమోదైంది. గ్రామంలో ఒక వర్గానికి చెందిన టీడీపీ నాయకులు అయ్యాళప్ప మరికొందరు సోమవారం ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో అక్కడికెళ్లిన అదే పార్టీకి చెందిన మరో నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి తమకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించాడు. పార్టీకి దూరంగా ఉండేవారిని, ఇతర పార్టీలోకి వెళ్లేవారు తమను ఎలా ప్రశ్నిస్తారని అయ్యాళప్ప వర్గం వారు అనడంతో కొద్ది సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలకు సర్దిచెప్పడంతో సమస్య అప్పటికి సద్దుమణిగింది. కాగా మంగళవారం హెబ్బటం బస్టాండులో ఇరువర్గాలకు చెందిన వారు మరోసారి వాగ్వాదానికి దిగి ఒకరికొకరు తోసుకుని కొట్టుకున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరు వర్గాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

దేవనకొండ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం ఆమె స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం ఆమె స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశమై మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వ్యాధుల గురించి ప్రజలకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఆశావర్కర్లు విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, వైద్యులు విజయ్‌కుమార్, కళ్యాణ్, సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, రంగస్వామి, జయలక్ష్మి, హనుమంతమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

హామీల అమలుకు కలిసికట్టుగా పనిచేస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, కూటమి నాయకులు

ఆదోని అర్బన్: ఎన్నికల సమయంలో ఆదోని నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి పార్టీల అభ్యర్థులతో కలిసికట్టుగా పనిచేస్తానని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి స్పష్టం చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్ స్వగృహంలో కూటమి నాయకులు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జ్ మీనాక్షినాయుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మల్లప్పతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదోని అభివృద్ధికి ఏమి కావాలో, ఎన్నికల ముందే ఏమేమి హామీలు ఇచ్చామో వాటన్నింటినీ చర్చించుకున్నామని చెప్పారు. అలాగే ప్రజలు లేవనెత్తిన సమస్యలు, తాను ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులతో చర్చించి తెలుసుకున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కూటమి పార్టీల నాయకులతో కలిసికట్టుగా అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. అభివృద్ధి చర్యలపై 10 రోజులకోసారి అందరం కలిసి చర్చించుకుని నిజాయతీ పాలన సాగిస్తామన్నారు. మీనాక్షినాయుడు, మల్లప్ప మాట్లాడుతూ నేటి చర్చతో కూటమిలో విభేదాలు తొలగిపోయినట్లేనని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. నాయకులు విట్టా రమేష్, ప్రకాష్‌జైన్, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రప్ప, దేవేంద్రప్ప, గుడిసె క్రిష్టమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల రుణం తీర్చుకోలేనిది

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూ మోమోరియల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉత్తమ అవార్డు పొందిన ఎస్.రామయ్య పదవీవిరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొన్నారు. 37 ఏళ్లుగా రామయ్య విధుల పట్ల అంకిత భావంతో పనిచేశారని, ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఉపాధ్యాయుల రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిదని చెప్పారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు అలీమ్ సిద్ధిఖీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయండి

ఆదోని అర్బన్: ప్లానింగ్ సెక్రటరీలు ప్రలోభాలకు గురికాకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్లానింగ్ సెక్రటరీలు కలిసికట్టుగా పట్టణాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అక్రమ కట్టడాల విషయంలో ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకుడికి సన్మానం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణానికి చెందిన జనసేవా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు విరూపాక్షి స్వామిని బీజేపీ నాయకుడు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సన్మానించారు. అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలో విరూపాక్షి స్వామి చేసిన సేవలను గుర్తిస్తూ మంగళవారం అవార్డుతో సన్మానించారు. విరూపాక్షి స్వామి గత 10 సంవత్సరాలుగా ఆదోని పట్టణంతో పాటు కర్నూలు జిల్లా, జాతీయ స్థాయిలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 23 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా అందిస్తున్న సేవలను కొనసాగించాలని మాజీ సీఎం సూచించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఆయుబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కౌతాళం: మండల పరిధిలోని ఏరిగేరి గ్రామంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ గోవిందు తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పనులు చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం మొయిన్ రోడ్డు, పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయ రోడ్డు, బీసీ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వివరించారు. అలాగే స్తంభాలకు విద్యుత్ దీపాల ఏర్పాటు, డ్రైనేజీల్లో పూడిక తొలగింపు పనులు పూర్తి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలి


సాతనూరు వద్ద ఫిల్టర్‌బెడ్‌లలో నిల్వ ఉన్న నీరు

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు ఎస్‌ఏపీ స్కీమ్ నుంచి నీటిని శుద్ధి చేసిన తర్వాతే సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎస్‌ఏపీ స్కీమ్ నుంచి మండలంలోని తుంబిగనూరు, సాతనూరు, చిర్తనకల్లు, దుద్ది, కోసిగి తదితర గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుంది. తుంగభద్ర నదిలో ప్రస్తుతం పైప్రాంతాలలో కురిసిన వర్షపు నీరు ప్రవహిస్తోంది. ఆ నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారని, శుద్ధి చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎస్‌ఏపీ స్కీమ్ వద్ద ఫిల్టర్ బెడ్స్‌ను శుభ్రం చేసి నీటిని శుద్ధి చేయాలని, ప్రజలకు సురక్షిత మంచి నీటిని అందించాలని కోరారు. రా వాటర్‌ను సరఫరా చేయడంతో వాటిని తాగి పలువురు వాంతులు, విరేచనాలు, జ్వరాలతో బాధపడుతున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి శుద్ధి చేసిన తర్వాతే తాగునీటిని సరఫరా చేసేలా చూడాలని కోరారు.

టెండర్ దక్కించుకున్న వారే షాపులు నిర్వహించాలి


ఎస్‌ఐ ఓబులేసుకు రాతపూర్వక పత్రాన్ని అందిస్తున్న జనార్దన్ శెట్టి

ఆలూరు రూరల్: స్థానిక ఎల్లార్తి రోడ్డులోని స్పోర్ట్స్ అథారిటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న షాపులను టెండర్‌లో దక్కించుకున్న వారు మాత్రమే నిర్వహించుకోవాలని ఆలూరు ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్ ధనుంజయ సూచించారు. ఆలూరుకు చెందిన జనార్ధన్ శెట్టి స్పోర్ట్స్ అథారిటీ కాంప్లెక్స్‌లోని షాపు నంబర్ 6ను టెండరు ద్వారా దక్కించుకున్నాడు. అయితే ఆ షాపును ఇటీవల వేరేవారికి బాడుగకు ఇచ్చేందుకు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఈ విషయమై జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు ఫిర్యాదు అందిండంతో విచారణ చేపట్టారు. మంగళవారం ఇండోర్ స్టేడియం కమిటీ మెంబర్ ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఓబులేసు సమక్షంలో జనార్ధన్ శెట్టి ద్వారా షాపు ఇతరులకు ఇవ్వనని, తానే నిర్వహించుకుంటానని రాతపూర్వక హామీని తీసుకున్నారు. అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని లేని యెడలా టెండర్‌ను రద్దు చేసి మరోసారి వేలం వేస్తామని మిగతా 5 షాపుల నిర్వాహకులను వారు హెచ్చరించారు.

నాసిరకం విత్తనాలను విక్రయిస్తే చర్యలు


రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

హాలహర్వి: రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి, లైసెన్స్‌ను రద్దు చేస్తామని డివిజన్ స్క్వాడ్ ఎమ్మిగనూరు ఏడీఏ ఖాద్రి, ఎమ్మిగనూరు ఏఓ అనిల్, హాలహర్వి ఏఓ శివశంకర్ ఫర్టిలైజర్స్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గూళ్యం, హాలహర్వి, చింతకుంట గ్రామాల్లోని వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, కిసాన్‌మాల్‌లను తనిఖీ చేశారు. షాపుల్లోని స్టాక్ రిజిస్టర్‌లు, ఇన్ వాయిస్, ఫామ్-సీ తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కచ్చితంగా రశీదులు ఇవ్వాలన్నారు.

నీట్ లీకేజీకి నిరసనగా 4న విద్యాసంస్థల బంద్


బంద్‌కు సంఘీభావం తెలుపుతూ అభివాదం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీని నిరసిస్తూ గురువారం దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు పలు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌ఓ, పీవైయూ, ఏఐఎస్‌ఏ విద్యార్థి సంఘాల నాయకులు విజయ్‌కుమార్, విజయేంద్ర, వీరేష్‌యాదవ్, మహేంద్ర, సురేంద్ర, సురేష్, నాగరాజు విద్యాసంస్థల బంద్‌కు సంఘీభావం తెలిపి మాట్లాడారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించడం దారుణమన్నారు. ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు నిర్వహించే బంద్ కార్యక్రమంలో విద్యావంతులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘ నాయకులు రాము, ప్రమోద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఈ నెల 4వ తేదీ గురువారం కేజీ నుంచి పీజీ వరకు అని విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు విద్యార్థి జేఏసీ నాయకులు శ్రీనివాసులు దస్తగిరి, అఖండ, తిరుమలేష్, రమేష్, ఉదయ్ తెలిపారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీయూఎస్, పీడీఎస్‌ఓ, బీడీఎస్‌ఎఫ్, డీఎస్‌ఎఫ్ ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకుల సమావేశం స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో జరిగింది. వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆ సంస్థను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు.